# ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత!

- పెగడపల్లి మండలంలో తీవ్రంగా సమస్య
- ముందుకు సాగని నిర్మాణాలు

పెగడపల్లి, జూన్ 23: ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యం నీరుగారుతున్నది. అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపులేమితో గృహ నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవాల్సి వస్తున్నది. పెగడపల్లి మండలంలో స్థానికంగా ఎలాంటి ఇసుక రీచ్‌లు లేకపోవడం, ప్రభుత్వం ఉచితంగా ఇసుక పంపిణీ చేయకపోవడంతో నిర్మాణాలకు ఆదిలోనే బ్రేక్ పడుతున్నది. మండలంలో 454 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేయగా, ఇప్పటి వరకు కేవలం 195 నిర్మాణాలకు మాత్రమే అధికారులు మార్కవుట్ ఇచ్చారు. అందులో కొన్ని ఇండ్ల నిర్మాణం మాత్రమే ప్రారంభం కాగా, అవి కూడా పునాదుల్లోనే నిలిచిపోయాయి. ఇసుక లేకుండా నిర్మాణాలు ఎలా చేపట్టాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. అలాగే బేస్మెంట్ దాకా నిర్మించుకున్న ఇండ్లకు తొలి విడత రూ.లక్ష బిల్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, అధికారులు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక, బిల్లుల సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, ఈ విషయమై గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా, మండలంలో ఉచిత ఇసుక పంపిణీపై తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. సాంకేతిక సమస్య వల్ల కొందరికి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని వివరించారు.



బతికపల్లిలో ఇసుక కొరతతో పునాదుల్లోనే నిలిచిన బొమ్మెన కనకమ్మ ఇల్లు



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

## అన్యాయం చేయద్దు

కరీంనగర్ కలెక్టరేట్/ జగిత్యాల జూన్ 23 : పెన్షనర్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై విశ్రాంత ఉద్యోగులు ఆగ్రహించారు. పెన్షనర్ల పాలిట అశనిపాతమైన నిర్ణయాలు అమలు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్నదని మండిపడ్డారు. వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2026 జనవరికి ముందు రిటైర్ అయిన వాళ్లకు అన్యాయం చేయద్దని వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్, జగిత్యాల కలెక్టరేట్‌ల ఎదుట నిరసనకు దిగారు. కరీంనగర్‌లో ఏఐఎస్పీఎఫ్ (ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్పీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విలాసాగరం చక్రపాణి మాట్లాడుతూ, 2026 జనవరి ఒకటి తర్వాత ఉద్యోగ విరమణ చేసే వారికి మాత్రమే నూతన వేతన చట్టం వర్తింపజేసేలా కేంద్రం వ్యవహరిస్తుండడం సిగ్గుచేటని విమర్శించారు. అలా అయితే అంతకు ముందు రిటైర్ అయిన వాళ్లు నష్టపోతారని వాపోయారు. వేతన సంఘం సిఫారసులు అమలుతోపాటు బకాయిలు చెల్లించే అంశంపై కూడా కేంద్రమే నిర్ణయం తీసుకునేలా చట్టంలో మార్పులు చేయడం పెన్షనర్ల హక్కులు కాలరాయడమేనని మండిపడ్డారు. పెన్షనర్లను గ్రూపులుగా విభజించి, ఏ గ్రూపునకు ఎప్పటి నుంచి పెన్షన్ సవరణలు అమలు చేయాలనే అంశంపైనా కేంద్రమే నిర్ణయించేలా చట్టాన్ని మార్చడం శోచనీయమన్నారు. ప్రస్తుతం కేంద్రం అనుసరిస్తున్న విధానాలనే భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అమలు చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం రూపొందించిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కరీంనగర్‌లో పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు మోసం అంజయ్య, దామెర మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, మక్సూద్ అలీ, రియాజ్, జగిత్యాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్ల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రవీందర్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




జగిత్యాల కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగులు

## బెనిఫిట్స్ ఎప్పుడిస్తరు?

- హైకోర్టు తీర్పు గడువు ముగిసినా జమకాలేదు
- జగిత్యాల కలెక్టర్‌కు రిటైర్డ్ ఉద్యోగులు వినతి

జగిత్యాల/జగిత్యాల రూరల్, జూన్ 23 : రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. ఉద్యోగాల నుంచి రిటైర్ అయి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ద్వారా వచ్చే బెనిఫిట్స్ అందకపోవడంతో సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించి, తమ గోడు వెల్లబోసుకున్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ త్వరగా అందేలా చూడాలని వేడుకున్నారు. ఆ తర్వాత రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ, గతేడాది జూలైలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన బెనిఫిట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నదని వాపోయారు. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించగా, 24 శాతం వడ్డీతో కలిపి బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందని, పది వారాల్లో బకాయిలు చెల్లించాలని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వస్తాయని, ఏడాది నుంచి ఎదురు చూస్తున్న తమకు నిరాశనే ఎదురవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.


### ఏడాది దాటినా చిల్లి గవ్వ రాలే



నేను గతేడాది మార్చిలో రిటైర్ అయ్యాను. ఏడాది దాటినా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు చిల్లిగవ్వ రాలే. హైకోర్టులో కేసు వేస్తే 24 శాతం వడ్డీ కలిపి ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా, ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలే. ప్రభుత్వం నుంచి స్పందన కూడా రాలే. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వస్తాయని, ఏన్నో ప్రణాళికలు వేసుకుంటే ఇంతవరకు ఒక్క రూపాయి ఇవ్వలే. కేవలం పెన్షనర్ జీతం మాత్రమే ఇస్తున్నది. బెనిఫిట్స్ గురించి ఆలోచిస్తూ రోగాల బారిన పడ్డాం. ఇప్పటికైనా ప్రభుత్వం మా బెనిఫిట్స్‌ను విడుదల చేయాలి. **- శ్రీపాద వెంకటరమణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు (జగిత్యాల)**

## కల్వల ప్రాజెక్టుపై కాంగ్రెస్ నిర్లక్ష్యం!

గండి పడక ముందు మత్తడి దూకుతున్న కల్వల ప్రాజెక్టు



2023 జూలైలో గండి పడిన కల్వల ప్రాజెక్టు



- గండి పడి రెండేండ్లయినా మరమ్మతులు శూన్యం
- వృథాగాపోతున్న జలాలు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- శిఖం భూమిలో పలువురి పాగ
- ట్రాక్టర్లలో చదును చేస్తూ సాగు
- పట్టని అధికారులు



ప్రాజెక్టులో నీరు లేక వట్టిపోతున్న కల్వల ప్రాజెక్టు

శంకరపట్నం, జూన్ 23 : రాష్ట్రంలో సాగునీటి వనరులపై నిర్లక్ష్యం కొనసాగుతున్నది. ప్రాజెక్టులపై చిన్నచూపు చూస్తుండడంతో ఎవుసం ఆగమైపోతున్నది. శంకరపట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టు గండిపడి రెండేండ్లయినా మరమ్మతులు చేయించకపోవడం వివక్షకు అద్దం పడుతున్నది. శంకరపట్నం, వీణవంక మండలాల్లో దాదాపు 1200 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ మినీ జలాశయం మత్తడికి 2023లో గండిపడింది. రింగ్ బండ్ ద్వారా తాత్కాలిక మరమ్మతులు చేసినా గతేడాది మరోసారి గండి పడి చుక్క నీరు లేకుండా పోయింది. ఈ క్రమంలో రైతులే స్వయంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక బస్తాలు తెచ్చి అడ్డుగా వేసి తాత్కాలికంగా బాగు చేసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ యేడు సాగు ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వంలో ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి మినీ ఎల్‌ఎండీగా మార్చేందుకు కసరత్తు జరుగుతుండగానే, ప్రభుత్వం మారడం శాపంగా మారింది. ప్రస్తుతం వానకాలం సీజన్ వచ్చినా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడం, బాగు చేయకపోవడంతో వరద నీరు వృథాగా పోతున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టు ఖాళీ కావడంతో కొందరు శిఖంలో పాగా వేస్తున్నారని మండిపడుతున్నారు. ఇష్టారీతిన ట్రాక్టర్లతో చదును చేస్తూ అక్రమంగా సాగు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సంజయ్ ఖబడ్దార్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

- నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం
- ఏపీ సీఎంకు సరెండరై కాళేశ్వరంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతవా..?
- తెలంగాణకు నువ్వు ఏం చేసినవ్
- మంత్రిగా ఒక్క శాఖపై నైనా రివ్యూ చేశావా
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఫైర్



కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 23: 'కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖబడ్దార్. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శిస్తే ఊరుకోబోం' అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హెచ్చరించారు. ఏపీ సీఎం చంద్రబాబుకు సరెండరై కాళేశ్వరంపై ఇష్టంవచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా సంజయ్ పట్టనట్లు ఉన్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు న్యాయం చేయడంలో బండి సంజయ్ విఫలమయ్యారని ఆరోపించారు. కాళేశ్వరంపై మాది మోడీ స్టాండ్, అమిత్ షా స్టాండ్ అని అంటున్న సంజయ్, తెలంగాణకు కేంద్రం ఏమీ ఇవ్వకపోవడమే మీ స్టాండా..? అని ప్రశ్నించారు. పీఎంగా మోదీ తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని, ఒక్క మెడికల్ కాలేజ్, ఒక్క ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేదని విమర్శించారు. బనకచర్లకు కేంద్రం నిధులు కేటాయిస్తున్నందున ఆ ప్రాజెక్టుకు నీళ్లు పోవాలని వారికి మద్దతుగా బండి సంజయ్ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కాళేశ్వరం తెలంగాణకు ఒక గొప్ప ప్రాజెక్ట్ అని, దీనిపై విషం కక్కడం మానుకోవాలని హితవుపలికారు. సంజయ్‌కి వ్యవసాయం గురించి కనీసం తెలియకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నీళ్ల మీద కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఎంత సేపు మరొకరిపై తప్పుడు ఆరోపణలు, రెచ్చగొట్టే ప్రకటనలు తప్ప బండికి మరో ఆలోచన రాదని దుయ్యబట్టారు. మండుటెండల్లోనూ తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో నిండు కుండల్లా చెరువులను మార్చింది కాళేశ్వరం ప్రాజెక్టు కాదా..? అని ప్రశ్నించారు. సంజయ్‌కు సబ్జెక్ట్ తెలియకుంటే వారి బీజేపీ నాయకుడు విద్యాసాగర్‌రావు వద్దకు వెళ్లి ట్రెయినింగ్ తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో బండి కుమ్మక్కై ఆయన చెప్పిన మాటలే మాట్లాడుతున్నారని విమర్శించారు. హోం శాఖ సహాయ మంత్రులు ఆయనతోపాటు నిత్యానంద రాయ్ ఉన్నారని, వారు ఫోర్సెస్ శాఖకు వెళ్లి పనులు చేస్తున్నారని, మరి సంజయ్ ముఖానికి ఒక్క శాఖ, అధికారుల వద్దకు ఏనాడైనా పోయాడా..? కనీసం తన పరిధిలో ఎన్ని శాఖలు ఉన్నాయో..? తెలుసా అని ప్రశ్నించారు. కరీంనగర్ సెగ్మెంట్‌లో సెకండ్ క్యాడర్‌లో ఎవరినీ ఎదగనివ్వలేదని, అతని గురువు సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి, అర్జున్‌రావును పక్కన పెట్టాశారని విమర్శించారు. సంజయ్ తన వైఖరి మార్చుకోవాలని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని, ప్రజలు నడ్డి విరగగొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. సమావేశంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సంస్కారం లేని వ్యక్తి అర్వింద్

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, జూన్ 23 : నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు కనీస సంస్కారం లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చావు నోట్లో తల పెట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. తండ్రి వయసున్న ఆయనపై, తెలంగాణ ఉద్యమకారులు కేటీఆర్, హరీశ్‌రావు, కవితపై చేసిన వ్యక్తిగత దూషణలు అర్వింద్ దిగజారుడు స్థాయిని సూచిస్తున్నాయన్నారు. 71 ఏండ్లున్న కేసీఆర్ ముసలివాడైతే, 74 ఏండ్లు ఉన్న మోదీని ఏమనాలో చెప్పాలని ప్రశ్నించారు. అర్వింద్ ముఖం చూసి ఎవరూ ఓటు వేయరని, మోదీని చూసి బీజేపీకి ఓట్లు వేయాలని, అడుక్కొని యాక్సిడెంటల్‌గా ఎంపీ అయ్యాడని ఎద్దేవా చేశారు. రెండుసార్లు ఎంపీగా గెలిచినప్పటికీ చేసిన అభివృద్ధి గుండు సున్నా అని పేర్కొన్నారు. బనకచర్లను జనకచర్లగా అనడం, ఇరిగేషన్‌పై కనీస అవగాహన లేకుండా మాట్లాడిన మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 23 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ మాట్లాడుతూ, మూడేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ, సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని మండిపడ్డారు. ఇదిగో నిధులు, అదిగో చెల్లింపులు అంటూ అటు యాజమాన్యాలను ఇటు విద్యార్థులను మభ్యపెడుతూ కాలం గడుపుతుండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆయన వెంట విద్యార్థి నాయకులు బియ్యని తిరుపతి, రోహిత్, చింటు, అజయ్, సాయి, తదితరులున్నారు.

## దండం పెడుతాం సర్.. ఈ ఫీజులు కట్టలేం

- మీరే ప్రభుత్వం నుంచి బకాయిలు ఇప్పించండి
- పెద్దపల్లి కలెక్టర్‌కు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రుల విజ్ఞప్తి



బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి దండం పెడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పెద్దపల్లి, జూన్ 23: 'దండం పెడుతాం సర్. ఈ ఫీజులు కట్టలేం. ప్రభుత్వం నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజు బకాయిలు ఇప్పించండి' అంటూ పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్షకు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. వారి మాటల్లో.. 'సర్ మేం ఎస్సీలం. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు మావి. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో భాగంగా మా పిల్లలను రామగిరి మండలం కల్వచర్లలోని ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నం. గతేడాది నుంచి ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం రాలేదని స్కూల్ యాజమాన్యం మా పిల్లలకు బుక్స్, యూనిఫాం ఇవ్వడం లేదు. గతేడాది ఫీజులు చెల్లించాలని, ప్రభుత్వం ఇస్తే తిరిగి మీ డబ్బులు మీకు ఇస్తామని పాఠశాల యాజమాన్యం అంటున్నది' అని వాపోయారు. తాము ఫీజులు కట్టే స్థితిలో లేమని, ప్రభుత్వం నుంచి బకాయిలు వచ్చేలా చూడాలని కోరారు. అలాగే తమ పిల్లలకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం ఇప్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



## అక్రమ కేసులను ఎత్తివేయాలి

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కమాన్, జూన్ 23 : ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడుతారా..? అని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఓదెల మండలానికి చెందిన నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిలదీస్తున్న బీఆర్ఎస్ ముఖ్య నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తున్నదని మండిపడ్డారు. కేటీఆర్‌పై ఏసీబీ కేసు విచారణ సందర్భంగా ఈ నెల 16న ఓదెలలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి, నిరసన తెలిపిన నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసనలు తెలుపడం, వ్యక్తీకరించడం, ధర్నాలు చేయడం సాధారణమేనని, అయినా ప్రభుత్వం ఇలా వేధించడం సరికాదని హితవు పలికారు. మళ్లీ బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడితే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చర్లపల్లి సురేశ్ గౌడ్, నాయకులు మద్దెల శ్రీనివాస్, పోలోజు రమేశ్, నరేశ్, మెరుగు మణికంఠ, పిట్ల అరుణ్‌కుమార్, గడ్డం అజయ్, గడ్డం శ్యామ్, గట్టు వినయ్, కొండ్రా రవి ఉన్నారు.

## చెరువులను కాపాడాలి

జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గంగపుత్రులు




జగిత్యాల/జగిత్యాల రూరల్, జూన్ 23 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంచెరువు, చింతకుంట చెరువులను ఆక్రమించి కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని కాపాడాలని జగిత్యాల మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు కలెక్టర్ బీ సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వారు ప్రజావాణికి వచ్చి వినతిపత్రం అందించారు. భారీ వర్షాలకు లింగంచెరువు నిండితే బయటకు వచ్చే వరదనీరు కాలువలోకి వచ్చే వీలు లేకపోవడంతో అక్కడ ఉన్న లోతట్టు ప్రాంతాల ఇండ్లలోకి వెళ్తున్నదని, దీంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తూములను ఆనుకుని గోడ నిర్మాణం చేయడంతో నీరు కిందికి పోలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యలపై రెవెన్యూ, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు గత కొంత కాలంగా ఫిర్యాదు చేస్తున్నా, ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. చెరువుల ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాల రూరల్, జూన్ 23: జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ నెల 26న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బీ సత్తమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడిప్లస్ సంస్థలో ఖాళీల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, ఎంపికైన వారు జగిత్యాల, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఫార్మసిస్ట్ పోస్టులు 40ఖాళీలు ఉన్నాయని, ఇందుకోసం డీబీ పార్మసీ పీసీఐ చేసి ఉండాలని నెలకు రూ.16-25వేల వేతనం ఉంటుందన్నారు. ఫార్మసిస్ట్ ఏఐడీ పోస్టులు 20 ఉన్నాయని ఇందుకోసం పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివినవారు అర్హులని ఎంపికైన వారికి రూ.13-16వేల వరకు వేతనం ఇస్తారన్నారు. సీఎస్‌ఏ 30పోస్టులకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని నెలకు రూ.12,400-రూ.13వేల వరకు వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 26న సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10.30గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.